www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 16 మార్చి 2023

5

తూర్పుగోదావరి



నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. రైల్వే స్టేషన్, ఐదు బళ్ల మార్కెట్, కన్యమ్మ తల్లి గుడి వీధి, సెకండ్ వార్డ్ వీధి, వివేకానంద వీధి, రైల్వే స్టేషన్ ఏరియా, కేసరి క్లబ్ వీధి, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, టి.నగర్, కోటిపల్లి బస్టాండ్, ఇన్నీసుపేట, గౌతమి ఘాట్, సుబ్రహ్మణ్య ఘాట్ ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నారు. శుక్రవారం దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీరాంపురం, రాజమహేంద్రవరంలోని సావిత్రి నగర్, హుకుంపేట, వరలక్ష్మి కాలనీ, జనచైతన్య నగర్, రామకృష్ణ నగర్, ఆదర్శ్ నగర్, బాలాజీ పేటలో గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ప్రణాళికతోనే మార్కులు పదిలం

- ఏప్రిల్ 3 నుంచి నిర్వహణ
- ప్రతి సబ్జెక్ట్‌కూ ఒకే పేపర్
- సంసిద్ధతతోనే సత్ఫలితాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యార్థి దశలో తొలి పబ్లిక్ పరీక్షలు పదో తరగతితోనే ప్రారంభమవుతాయి. విద్యార్థి భవిత కూడా ఈ పరీక్షలపై ఆధారపడి ఉంటుంది. గతంలో ఆరు సబ్జెక్టుల్లో 11 పేపర్లకు పరీక్షలు నిర్వహించేవారు. కొవిడ్ వ్యాప్తి కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో పరీక్షలు నిర్వహించకుండానే పదో తరగతి విద్యార్థులందర్నీ ప్రభుత్వం ఉత్తీర్ణులను చేసింది. గతేడాది సైన్స్ సబ్జెక్ట్‌లో రెండు పేపర్లు, మిగిలిన ఐదు సబ్జెక్టులకు ఒక్కో పేపరు చొప్పున మొత్తం 7 పేపర్లకు పరీక్ష నిర్వహించింది. ఈ ఏడాది ప్రతి సబ్జెక్టుకు ఒక పేపరు చొప్పున 6 పేపర్లు రాయాల్సి ఉంది. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్ష గడువు సమీపిస్తుండడంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. తొలి పబ్లిక్ పరీక్షలు కావడంతో విద్యార్థుల్లో ఒత్తిడికి గురికావడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. అధ్యయనంలో సబ్జక్టుల వారీగా శ్రద్ధ తీసుకోవటంతో మంచి ఫలితాలు సాధ్యం.

'టాప్'తో అనేక ప్రయోజనాలు

పాఠశాల విద్యాశాఖ 'టాప్' పేరుతో డైలీ టెస్టులు నిర్వహిస్తోంది. ప్రతిరోజూ ఈ టెస్ట్‌ల నిర్వహణతో ఆరు రోజుల్లో రెండు ఛాప్టర్‌లు పూర్తవుతాయి. ఏడో రోజున ఆ రెండు ఛాప్టర్‌లపై మరోసారి పరీక్ష నిర్వహిస్తారు. దీనివల్ల గణితంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. గతంలో ఇచ్చే అర మార్కు బిట్‌లకు ఒక మార్కు ఇవ్వడం వల్ల విద్యార్థులు 12 మార్కులను స్కోరు చేసే వీలుంది. వత్తాలు, త్రిభుజాలు, సర్ల రేఖలపై 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. వాస్తవ సంఖ్యలు ఛాప్టర్ ద్వారా 8 మార్కులను సులువుగా సాధించవచ్చు. గ్రాఫ్ పేపర్‌లో మూలాలు కనుగొనుట ద్వారా 8 మార్కులు పొందవచ్చు.

సబ్జక్టుల వారీగా అవగాహన అవసరం

పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి. ఇంగ్లీష్‌లో బయోగ్రాఫికల్ స్కెచ్‌లు రాసేటప్పుడు వరుసక్రమం పాటించాలి. కాంప్రెన్సిషివ్ (పాసేజ్‌లు)ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుంటే సమాధానాలు రాసే వీలుంది. అప్లికేషన్ మెథడ్‌లో ఉండే ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదవాలి. లేదంటే తప్పులు రాసే అవకాశం ఉంది. క్రియేటివ్ రైటింగ్(సజనాత్మకత) రాసేటప్పుడు కాన్వర్జేషన్, లెటర్ రైటింగ్, ప్రశ్నల తయారీ(డబ్ల్యూహెచ్ క్వశ్చన్) సరిగా నింపితే మంచి మార్కులు వస్తాయి. ప్రశ్నాపత్రంలో చిత్రాలను బాగా పరిశీలించి.. అందుకు తగిన సమాధానం రాయాలి. పాత ప్రశ్నాపత్రాలను పరిశీలించి సన్నద్ధమైతే.. ప్రయోజనం ఉంటుంది. సైన్స్‌లో అప్రమత్తత తప్పనిసరి సామాన్య శాస్త్రాన్ని.. ఫిజికల్, బయలాజికల్ సైన్స్‌గా విభజించి ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తారు. గతేడాది వరకు సైన్స్ పరీక్షకు రెండు పేపర్లు ఉండేవి. ఈ ఏడాది మాత్రం ఒకే పేపర్. మొదటి గంటన్నర ఫిజికల్ సైన్స్‌కు, చివరి గంటన్నర బయలాజికల్ సైన్స్‌కు విభజిస్తారు. ప్రశ్నాపత్రం మాత్రం ఒకటే. వేర్వేరుగా సమాధాన పత్రాలు ఇస్తారు. సమాధాన పత్రాలు రాసేటప్పుడు పొరపాటు జరిగితే ఆ విద్యార్థికి చాలా ఇబ్బంది ఏర్పడుతుంది.



సైన్స్, సోషల్ స్టడీస్‌ను అధ్యయనం చేయాలి ఇలా..

సాంఘికశాస్త్రాన్ని.. జాగ్రఫీ, ఎకనామిక్స్ ఒక పార్ట్‌గా, హిస్టరీ, సివిక్స్ రెండో పార్ట్‌గా విభజించి చదవాలి. బార్ గ్రాఫ్స్, పై డయాగ్రమ్స్, టైమ్‌లైన్ చార్ట్‌లను సరిగా అర్థం చేసుకుంటే 8 నుంచి 12 వరకు మార్కులు పొందవచ్చు. భారతీయ భౌగోళిక స్వరూపాలు, శీతోష్ణస్థితి, గ్లోబలైజేషన్, సమతుల్య అభివద్ధి ఛాప్టర్‌ల నుంచి 8 మార్కుల ప్రశ్నలు వస్తుంటాయి. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు దాని ప్రభావం, భారత రాజ్యాంగం, జాతీయోద్యమం, సామాజిక ఉద్యమాలు, ప్రపంచ యుద్ధాల తర్వాత ప్రపంచం అనే అంశాల నుంచి 8 మార్కులు ప్రశ్నలు తరుచూ వస్తుంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిపి 50 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఉష్ణోగ్రత ఎన్ని డిగ్రీల వద్ద వేడెక్కుతుంది, ఆవిరవుతుంది ఈ తేడాలను అడుగుతుంటారు. అయస్కాంత బలరేఖల డైరెక్షన్ తప్పుగా ఇచ్చి వాటిని సరిచేయమంటుంటారు. రసాయన ప్రయోగాల్లో ఎలాంటి వాయువులు వస్తాయన్న ప్రశ్నలు వస్తుంటాయి. విద్యార్థులు తప్పనిసరిగా డయాగ్రమ్‌ను రోజుకు రెండు వంతున ప్రాక్టీస్ చేయాలి. ప్రమాణాలు తప్పులు రాయడం వల్ల విద్యార్థులు కొద్దిగా మార్కులు కోల్పోతున్నారు. దీనిని సరిచేసుకుని స్పష్టంగా రాస్తే 100శాతం మార్కులు స్కోర్ చేయవచ్చు.

రన్నింగ్ నోట్స్‌పై దృష్టి పెట్టాలి

తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను బోధించినప్పుడే విద్యార్థులు నోట్సులో ముఖ్యమైన పాయింట్లను రాసుకుంటారు. వీటని కచ్చితంగా ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. పాఠ్య పుస్తకంపై పూర్తి శ్రద్ధ చూపితే మంచి మార్కులు సాధించడం సులువు. ప్రయోగాలు, భావన, విశ్లేషణపై 1, 2 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నాపత్రంలో ఇచ్చిన చిత్రాన్ని గుర్తించి విశ్లేషించి సమాధానాలు రాయాలి. శాస్త్రవేత్తలు, పరిశోధనలను బాగా చదవాలి. ముఖ్యంగా సైన్స్ పేపర్‌లో మొదటి 16 ప్రశ్నలు ఫిజికల్, 17 నుంచి 33 ప్రశ్నలు బయలాజికల్ సైన్స్‌పై ప్రశ్నలు ఉంటాయి.

- దిలీప్‌కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్.

126 కేంద్రాల్లో నిర్వహణ

జిల్లాలో 126 కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు నిర్వహించనున్నాం. 26,129 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. ఉన్నత పాఠశాలలను సందర్శించి బోధనా తీరును, విద్యార్థుల స్థితిగతులను పరిశీలిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచిస్తున్నాం. ప్రశ్నాపత్రంపై అవగాహన కల్పించడంతో పాటు సమాధానాలు స్పష్టంగా రాసేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం.

- అబ్రహాం, జిల్లా విద్యాశాఖ, అధికారి.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రాజమండ్రి, కొవ్వూరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన 47 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలకు 15,481 మంది (98.03 శాతం), వొకేషనల్ పరీక్షలకు 1700 మంది (88.31శాతం) హాజరయ్యారని ఇంటర్మీడియట్ ప్రాంతీయ తనిఖీ అధికారి ఎన్ఎస్‌వి.ఎల్ నరసింహం తెలిపారు. రాజమండ్రి డివిజన్ లోని 32 కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 11,728 మందికి గాను 11,517 మంది హాజరవగా, 211 మంది గైరాజరయ్యారని, కొవ్వూరు డివిజన్‌లోని 15 కేంద్రాల్లో 4,057 మందికి గాను 3,964 మంది హాజరవగా 93 మంది గైర్హాజరయ్యారన్నారు.



ధవళేశ్వరంలో పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - యంత్రాంగం

ధవళేశ్వరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 37,288 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 47 పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియేట్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షల కోసం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష తరగతిలో పరీక్షలు సజావుగా రాసేందుకు వీలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలం దష్ట్యా ప్రతి కేంద్రంలో మెడికల్ క్యాంపు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను, తరగతి గదిలో తాగునీటి వసతిని అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రతి తరగతి గదిలో సిసి కెమేరా ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు మాధవీలత తెలిపారు. కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్షల నిర్వహణ విధానాన్ని పర్యవేక్షిస్తున్నామని వివరించారు. ఆర్టీసి , రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రతి పరీక్షా కేంద్రానికి బస్సు, ఆటోలతో కూడిన రవాణా ఏర్పాటు చేశామన్నారు. ఎక్కువ మంది ఒక చోట నుంచి వచ్చే వారికి రవాణా సౌకర్యాలు అందుబాటులో లేని కారణంగా ఇబ్బందులు పడుతున్న వారు వివరాలు తెలియ చేస్తే పరీక్ష సమయాల్లో ఆయా రూట్లలో రవాణా సదుపాయం అందుబాటులోకి తీసుకుని వస్తామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. కలెక్టర్ వెంట ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి (ఆర్ఐఒ) ఎన్ఎస్‌వి.ఎల్ నరసింహం ఉన్నారు. **తాళ్లపూడి** మండల పరిధిలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు పరీక్షకు 22 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 221 మందికిగాను 199 మంది హాజరయ్యారు. ఎస్ఐ కెవి రమణ పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రం చీఫ్ పి.గౌరీనాథ్, డిఒ కెవి.రమణమూర్తి పర్యవేక్షించారు. **కోరుకొండ** మండలంలో ఏకైక పరీక్షా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిసి కెమేరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామచంద్రరావు తెలిపారు. మొత్తం 497 మంది విద్యార్థులకుగాను 473 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. డిఎస్‌పి కడలి వెంకటేశ్వరరావు పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. **గోకవరంలో** రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిఎస్ఆర్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. **గోపాలపురంలో** పరీక్షలకు 27 మంది గైర్హాజరైనట్లు నిర్వహణాధికారి యువి.రమణ, టి.ఉమాదేవి తెలిపారు.



గోపాలపురంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ఉగాది నాటికి 3,660 ఇళ్ల నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం


ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దష్ట్యా హౌసింగ్ ఆర్ఎల్ నుంచి ఆర్‌సి పనులు, ఉపాధి హామీ పథకం లక్ష్యాలను నూరు శాతం పూర్తి చెయ్యాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్ నుంచి హౌసింగ్, ఉపాధి హామీ, పౌర సేవలు, ఆధార్ అప్డేషన్‌పై ఎంపిడిఒలు, హౌసింగ్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, ఉగాది నాటికి ఇచ్చిన 6,500 ఇళ్ల లక్ష్యంలో 3,660 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి వారం లక్ష్యాలను సాధించడానికి ప్రణాళిక ప్రకారం పూర్తి చెయ్యాలి. ప్రతి వారం లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హౌసింగ్‌పై సమస్యలను అధిగమించి ముందుకు వెళ్లేలా వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి రోజూ 60 వేల పని దినాలు సగటు సాధించాలని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. జిల్లాకు సంబంధించిన 59 లక్షల రీవైజ్డ్ ఉపాధి హామీ పని దినాల లక్ష్యాలను సాధించడానికి గానూ ఇప్పటి వరకూ 51.49 లక్షలు సాధించామని, ఇంకా 9 లక్షలు పని దినాలు లక్ష్యాల మేరకు గుర్తించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో సగటున రోజుకి 45 వేల పనిదినాలు మాత్రమే సాధిస్తున్నారని, మెట్ట ప్రాంతాల్లో మండలాల వారికి నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించి లక్ష్యాలు సాధించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రోజుకి సగటున రోజుకి 40 సేవలు అందిస్తున్నట్టుక లెక్టర్ డాక్టర్ మాధవీలత పేర్కొన్నారు. ఆ మేరకు మరింతగా పౌర సేవలు అందించే సామర్థ్యం పెంచుకోవాలన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వినియోగదారుల దినోత్సవం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు జెవిఎస్వి ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. వినియోగదారులు వారి హక్కులను తెలుసుకొని, వస్తువు కొని నష్టపోయినప్పుడు స్వయంగా ఫిర్యాదు చేసి సత్వరం పరిష్కారం లేదా నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. అంతకుముందు డిసిపిసి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అతిధులను వేదిక మీదకు ఆహ్వానించి కార్యక్రమం యొక్క విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పౌరసరఫరాల అధికారి పి.ప్రసాద రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వినియోగదారుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలిపారు. లీగల్ మెట్రాలాజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎఎస్.రాజు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.వసుందర, ఎలక్ట్రిసిటీ ఎఇఇ ఫణి కుమార్, జిల్లా రవాణా శాఖ కృష్ణ కుమార్, డిప్యూటీ స్కూల్స్ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వారి డిపార్ట్మెంట్ల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిపిసి సభ్యులు వీర శేఖర్, డివికె రమేష్, వైకె.శ్రీనివాస్, అనంతరావు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, విఆర్ఒలు, వార్డు వాలంటీర్లు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రోలాజి మరియు ఆహార భద్రత వారు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌లో కల్తీ ఏవిధంగా తెలుసుకోవచ్చో హాజరైన వినియోగదారులకు వివరించారు.

కార్టూ'నిజం'



లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలనే అమ్ముతారు కదా సార్..!!

బోరు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- గోకవరం

మండల కేంద్రమైన గోకవరం గ్రామంలో మార్కెట్ ఆవరణలో ఉన్న వెలమ తూర్పు కాపు కమ్యూనిటీ భవనం వద్ద జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు పంచాయతీ నిధుల నుంచి రూ.5 లక్షల బోర్ నిర్మాణానికి బుధవారం గోకవరం మండల సచివాలయం కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి నాయకులు సుంకర వీరబాబు, సొసైటీ అధ్యక్షుడు గాజంగం సత్తిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు దాసరి తమ్మన్న దొర, వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర రమణ, చింతల అనిల్ కుమార్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుంకర వీరబాబు మాట్లాడుతూ కమ్యూనిటీ భవనం అభివద్ధికి మండల పరిషత్ నుంచి రూ.5 లక్షల నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. తన తల్లి జ్ఞాపకార్థం వీరబాబు రూ.లక్ష విరాళం ప్రకటించారు. జెడ్‌పిటిసి నుండి రూ.5 లక్షల ఇస్తున్నట్లు గోకవరం మండలం సచివాలయాలు కన్వీనర్ దాసరి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పాలూరి బోసు బాబు, దాసరి చిన్నబాబు, పులపర్తి బుజ్జి, తుమ్మల చిన్నబ్బు, ఆయా సంఘ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రై సైకిల్స్ అందజేత

ప్రజాశక్తి- ధవళేశ్వరం

రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పుట్టినరోజు సందర్భంగా ధవళేశ్వరం టిడిపి నాయకులు సావాడ శ్రీనివాసరెడ్డి సమకూర్చిన ట్రై సైకిల్స్‌ను వంకాయల వీరభద్రరావు, నురుకుర్తి సత్యనారాయణ, పెంకే శ్యామలకు అందించారు. ఈ సందర్భంగా గోరంట్ల, శ్రీనివాసరెడ్డికి వికలాంగులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్సేటి శివప్రసాద్, పండూరి అప్పారావు, యర్రమోతు ధర్మరాజు, పిన్నింటి ఏకబాబు, మజ్జి పద్మ, సింగ్, సురేంద్ర తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-తాళ్లపూడి

కుల వ్యవస్థ, అంటరానితనాన్ని వ్యతిరేకించిన సామాజిక సంస్కర్త కాన్షీరామ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని నేటి విద్యార్థులు అంటరానితనానికి వ్యతిరేకంగా ఉండాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. కాన్షీరామ్ జయంతి సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -కోరుకొండ

కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీరంగపట్నం విలేజ్ క్లినిక్-1లో ఆప్తాలమిక్ అధికారి సిహెచ్.ఆనందరావు వద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 60 ఏళ్ళు నిండిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్లు అందజేస్తామని, ఆపరేషన్లు అవసరమైన వారికి రాజమహేంద్రవరం ప్రభుతాసుపత్రి, గౌతమీ నేత్రాలయ, వేమగిరి గ్రామంలోని పరమహంస కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. కోటికేశవరం పిహెచ్‌సి పరిధిలో కంటి పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని అన్నారు. దోసకాయలపల్లి, కోరుకొండ పిహెచ్‌సిల పరిధిలో త్వరలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ఆప్తాలమిక్ అధికారి ఆనందరావు తెలిపారు.

బాలుని వైద్యం కోసం సాయం

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన అక్షయ్ రామ్ కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతూ చెన్నై ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు. అక్షయ్ రామ్‌కు గోకవరం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో మారుతి స్వీట్స్ స్టాల్ యజమాని ఎస్‌డి రబ్బానీ రూ.10 వేల ఆర్థిక సాయం అందించచరు. తంటికొండ రహదారిలోని క్రీస్తు సంఘ సభ్యుడు పి.రాజబాబు రూ.6,500 మొత్తం రూ.16,500 నగదును వైద్యులు పాలూరి బోసుబాబుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.నాగేంద్రుడు, సి.చంటి, ఎం.కన్నా, ఎం.సతీష్ కుమార్, వి.జయరాజు, ఎస్.ఏసు, నాగరాజు, కిరణ్ కుమార్, అబ్బులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రమేష్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ప్రాధాన్యత ఉన్న పనులు గుర్తించాలన్నారు. వేసవి దష్టిలో ఉంచుకుని కూలీలు వడగాల్పుల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవి రీత్యా ఎండిన కాలువలు, చెరువుల్లో పనులు చేయడానికి అనుకూలంగా పనులు చేయాలన్నారు. కూలీల సంఖ్య పెంచి, ప్రతి కూలీ వందరోజులు పని పూర్తి చేసేందుకు సన్నాహాలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ నాగశేషవేణి, మండలంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మున్సిపల్, ఎంపిడిఒ, ఇతర అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఇప్పటికే వాతావరణ శాఖ ఈ ఏడాది వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో రానున్న వేసవిని దష్టిలో ఉంచుకొని ఎక్కడా తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ఉండటం కోసం ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందనే హెచ్చరికలను దష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీరు అందించడంలో అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నగరపాలక, పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి చెరువులను ముందస్తుగా ఈ నెలాఖరుకల్లా పూర్తిస్థాయిలో నింపాలన్నారు. జిల్లాలో గుర్తించిన అవాసాల్లో బోర్ వెల్స్, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకుల పరిస్థితి, లీకేజిలపై పరిశీలన చేసి ట్యాంకుల మరమ్మత్తులు, క్లీనింగ్ పనులు చేయించాలన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఈ పంట నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-గోపాలపురం

ఈ - పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా జాబితాను పరిశీలించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.రాజారావు సూచించారు. బుధవారం మండలంలోని భీమోలు రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ ఈ-పంట నమోదుకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను సోషల్ ఆడిట్ కోసం వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి రైతు భరోసా కేంద్రంలో 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు ప్రచరణకు ఉంచినట్లుగా తెలిపారు. దీనికి సంబంధించిన గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ - పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా ఈ జాబితాను ఒకసారి పరిశీలించి ఏమైనా మార్పులు ఉన్న యెడల అనగా పంట పేరు, రకం, నీటిపారుదల, విస్తీర్ణం, సర్వేనెంబర్ మరి ఏ ఇతర విషయంలోనైనా తేడాలు ఉన్నట్లయితే సంబంధిత రైతు భరోసా సిబ్బందిని సంప్రదించి మార్పులు చేయించుకోవాల్సిందిగా తెలిపారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ప్రతి ఒక్క పథకం అమలుకు ఈ పంట నమోదు మూలం కాబట్టి వీటి వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో చూసుకునే బాధ్యత రైతులకు కూడా ఉందని తెలిపారు. రబీ సీజన్లో గోపాలపురం మండలంలో అన్ని గ్రామాల్లో కలిపి వరి 3,932, మొక్కజొన్న 4,446, పొగాకు 4,650, నాటు పొగాకు 70, చెరకు 346, అపరాలు 81, నువ్వులు 80, వేరుసెనగ 126 మరియు ఇతర పంటలు 776 ఎకరాలు కలిపి మొత్తం 14,513 ఎకరాలలో సాగు చేసినట్లు ఈ-పంట నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు, రాంపండు, బండారు దొరబాబు, కష్ణ, అగ్రికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లకు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, కడియం, ధవళేశ్వరం

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి జన్మదినోత్సవం సందర్భంగా గుడా మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కష్ణ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కడియం రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పుట్టినరోజు సందర్భాన్నిపురస్కరించుకుని, కడియం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం గోరంట్లను ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. అభినందనలు తెలిపిన వారిలో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లా సత్యనారాయణ (చంటియ్య), కార్యదర్శి బొరుసు సుబ్బారాయుడు, పలువురు కార్యవర్గ సభ్యులు వున్నారు. ధవళేశ్వరంలోని బధిరుల పాఠశాల (పలుకు స్కూల్)లో గంటా సత్యనారాయణ, దుర్గా భవాని ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి 78వ పుట్టినరోజు వేడుకలు విద్యార్థులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. అనంతరం గోరంట్ల రూ.10 వేలను విద్యార్థుల అవసరాలకు ఉపయోగించాలని అందజేశారు. ఈ కార్యక్రమంలో పండూరి అప్పారావు, ఆళ్ల ఆనందరావు, తలారి మూర్తి, బత్తిన ఏడుకొండలు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు కథకు మాణిక్యం వెలుగులు

ప్రజాశక్తి-తాళ్లపూడి

తెలుగు సాహిత్యానికి కాంతం కథలు పేరుతో వెలుగు నింపిన ముని మాణిక్యం మహోన్నత రచయిత అని తాళ్లపూడిలోని శ్రీ విజేత హైస్కూల్ హెచ్ఎం, కవి డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ అన్నారు. కవి ముని మాణిక్యం జయంతి సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మోపిదేవి విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సాహిత్యం పురోభివద్ధికి మునిమాణిక్యం తన రచనల ద్వారా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నతనంలోనే పొదుపు నేర్పాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని దూబచర్లలో సంఘమిత్ర విద్యాలయంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె.పాండురంగారావు బుధవారం సంఘమిత్ర చిల్డ్రన్స్ బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలంటే 18 ఏళ్లు వేచి ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. 10 ఏళ్లు నిండిన వారు స్వయంగా ఎకౌంటు ఆపరేట్ చేసుకోవచ్చన్నారు. బ్యాంకుల్లో పిల్లల కోసం ప్రత్యేకంగా ఖాతాలు ఉన్నాయన్నారు. స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం గిరి కుమార్, అకడమిక్ డైరెక్టర్ కెల్లా వంశీకృష్ణ పాల్గొన్నారు.

ధరణికి నీట్‌లో 475వ ర్యాంకు

ప్రజాశక్తి -గోకవరం

మంచి జనరల్ సర్జన్‌గా ప్రజలకు వైద్య సేవలు చేయాలన్నదే తన లక్ష్యమని జంగేటి ధరణి చెప్పారు. గోకవరం గ్రామానికి చెందిన జంగేటి ధరణి మంగళవారం విడుదలైన నీట్ ఎంట్రన్స్ పరీక్షల్లో 800వందల మార్కులకు గాను 645 మార్కులు తో 475 ర్యాంకు సాధించారు ఈ సందర్భంగా బుధవారం డాక్టర్ జంగేటి ధరణి విలేకరులకు వివరాలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో దూకి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం గౌతమి గోదావరి వంతెనపై నుంచి బుధవారం గోదావరిలోకి దూకి ఒక వ్యక్తి మృతి చెందాడు. రామచంద్రపురం మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన దూళ్ళ సత్యనారాయణ(35) రావులపాలెం-జొన్నాడ వంతెన పై నుంచి దూకాడు. విషయం తెలుసుకున్న రావులపాలెం పోలీసులు నావపై వెళ్లి సుమారు అరగంట పాటు శ్రమించి అతనిని ఒడ్డుకు చేర్చారు. రావులపాలెం ఎస్ఐలు రమణ, సురేంద్ర, హైవే పెట్రోలింగ్ పోలీసులు వివిబి స్వామి, సిహెచ్ రామ్మోహనరావు(35) సిబ్బంది. సత్యనారాయణకు ప్రథమ చికిత్స అందించి అనంతరం హైవే అంబులెన్స్ సిబ్బంది హైవే అంబులెన్స్ పై కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలూకా అతను ఎవరనేది తెలియకపోవడంతో క్షతగాత్రుని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు స్థానికులకు సమాచారం అందించారు. పరిస్థితి విషమించడంతో అతను మృతి చెందాడు. మృతుడు దూళ్ళ సత్యనారాయణ రామచంద్రపురం గ్రామస్తుడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని తండ్రి రావులపాలెం పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ఫిర్యాదు ఇవ్వగా రావులపాలెం ఎస్ఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై యువకుని అత్యాచారం

ప్రజాశక్తి - పెదపూడి

బాలికపై ఒక యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనలో యువకుడుపై కేసు నమోదు చేసినట్లు పెదపూడి ఎస్ఐ పి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కైకవోలు గ్రామానికి చెందిన ఒక బాలిక స్థానిక జడ్పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఆమె ప్రతి రోజు సైకిల్‌పై పాఠశాలకు వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇనకోటి రాజు అనే యువకుడు ఆమె పాఠశాలకు సైకిల్‌పై వెళ్లి వచ్చేటప్పుడు మోటార్ బైక్‌పై వెంబడిస్తూ తాను నిన్ను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటాను అని అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఇంట్లో కారు పొరుగు ఇళ్లు కావడంతో ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ రాత్రి రాజు బాలికను ఇంటి వెనుక ఉన్న పెరట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేయగా కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కాజులూరు

యానం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న వాసంశెట్టి శ్రీను నీ అరెస్టు చేసి అతని వద్ద నుండి 12 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నామని తాళ్ళరేవు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎం.వి. వి.బి. కుమార్ తెలిపారు. బుధవారం ఉప్పుమిల్లిలో తనిఖీలు చేస్తుండగా బస్‌షెల్టర్ వద్ద అనుమానస్పదంగా ఉన్న పెదపూడి మండలం పెద్దాడ గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనును తణికి చేయగా యానాం 12 కొనుగోలు చేసి పెద్దాడ తరలిస్తుండగా ఉప్పుమిల్లి వద్ద స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఈ దాడిలో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వేధింపుల కేసులో ఏడు సంవత్సరాల తర్వాత ఒక వ్యక్తికి కొత్తపేట కోర్టు రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన సజ్జ కృష్ణవేణి 2016 సంవత్సరంలో భర్త, అత్తమామలు కుటుంబ సభ్యులు వేధింపులు తాళలేక కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణ వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు కృష్ణవేణి భర్త, అత్తమామలు బావగారు సత్తిబాబు తదితరులపై అప్పట్లో ఏడుగురుపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆరుగురికి శిక్ష విధించారు. బావ అయిన సత్తిబాబు అప్పట్లో విదేశాలు వెళ్లిపోయాడు. అతను తిరిగి రావడంతో ఎస్ఐ సిహెచ్.సుధాకర్ బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో కళాశాల సిబ్బందికి సంకురాత్రి ఫౌండేషన్ కాకినాడ శ్రీ కిరణ్ నేత్ర శస్త్ర చికిత్సాలయం సహకారంతో ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. పెద్దాపురం విభాగం వారి నేతత్వంలో సుమారు 200 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్‌కు, మరికొందరిని కంటి అద్దాల కోసం సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ .ఐ.వి.వీరాంజనేయులు, విద్యార్థులను అభినందించారు. శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి పెద్దాపురం విభాగం డాక్టర్ కళ్యాణి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సేవా కార్యక్రమాల్లో డీన్లు ఎస్. రమాశ్రీ, జె.డి. వెంకటేష్, సుమారు 30మంది ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.

'ఆయుష్మాన్' సర్వే వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గ్రామాల్లో పెండింగ్‌లో వున్న ఆయుష్మాన్, ఎస్‌డిజి సర్వేలు వేగవంతానికి చర్యలు చేపట్టాలని గ్రామ వలంటీర్లను, సచివాలయాల సిబ్బందిని సామర్లకోట ఎంపిడిఒ డి.శ్రీలలిత ఆదేశించారు. బుధవారం వేట్లపాలెం- 3వ గ్రామ సచివాల యంలో సర్వేలపై గ్రామ కార్యదర్శి, సచివాలయా సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించి సూచనలు ఇచ్చారు. గ్రామ కార్యదర్శి మోసే, సిబ్బంది, వలంటీరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

వాకతిప్ప ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను బుధవారం రాష్ట్ర వైసిపి నాయకులు రావు చిన్నారావు పరిశీలించారు. పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు ఆదేశాలతో మొదట ఐదు గదుల స్లాబ్ పనులను పరిశీలించి నాణ్యతగా నిర్మించాలని కోరారు. ఆయన వెంట వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు, ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి రాజకుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ పోతుల కోటారావు, ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి పాల్గొన్నారు.

యానాం వార్తలు

ప్రెసిడెంట్ గడువు పెంపు రద్దు చేయాలి

ఇప్పటి వరకు అవకతవకలపై విచారణ జరిపించాలి

- కోపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ డైరెక్టర్స్

ప్రజాశక్తి - యానాం



విలేకరులతో మాట్లాడుతున్న డైరెక్టర్లు

యానాం కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు, కమిటీ గడువు ఈ నెల 31తో ముగియనుండటంతో మరో మూడు నెలలు పెంచుతూ పుదుచ్చేరి కోపరేటివ్ డైరెక్టర్ బుధవారం జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ కమిటీ డైరెక్టర్లు పలువురు స్థానిక పరిపాలనాధికారి మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు డైరెక్టర్లు విలేకరులతో మాట్లాడుతూ కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు పొన్నాడ విఘ్నేశ్వరుడు ఎన్నిక సరైనది కాదని అప్పటినుండి తాము అనేక సార్లు ఫిర్యాదులు చేశామని ఆ కమిటీ డైరెక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 31తో తమ కమిటీ గడువు ముగియనుందని అయితే విఘ్నేశ్వరుడు తమకు వేరే కారణాలు చెప్పి సంతకాల చేయించుకుని కమిటీ కాలపరిమితిని పెంచే విధంగా పుదుచ్చేరి నుంచి అనుమతులు రప్పించుకు న్నారని తెలిపారు. ఆయన పదవీకాలంలో కోఆపరేటివ్ వ్యాపార లావాదేవీల్లో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోగా కోఆపరేటివ్ లిక్కర్ షాపులకు రెన్యూవల్ చేయించ డానికి సైతం డబ్బు లేదనటం విడ్డూరంగా ఉందన్నారు. లక్షలాది రూపా యలు ఆదాయం వచ్చినట్లు రికార్డులు ఉన్నప్పటికీ తమ వద్ద ఒక్క రూపాయి కూడా లేదని ప్రెసిడెంట్ చెప్పడం కనీసం ఒక్క నెల జీతం అయినా ఇవ్వాలని సిబ్బంది కోరినప్పటికీ జీతాలకే కాదు ఈఎస్ఐ, పిఎఫ్ కట్టడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవనడం దారుణం అన్నారు. ఈ మేరకు స్టోర్స్ అధ్యక్షుడి గా ఉన్న కాల పరిమితిలో మొత్తం జరిగిన వ్యాపార లావాదేవులపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని వినతిపత్రంలో పేర్కొన్నామని డైరెక్టర్లు మట్టపర్తి మంగ, నల్లానాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఎండి బేగమ్ తదితరులు తెలిపారు.

ఫ్రెంచ్ లింకింగ్ ఛానల్ పరిశీలన


పిల్లంక కాలవను పరిశీలిస్తున్న ఆర్ ఏ ఓ మునిస్వామి

మంచినీటి సమస్యపై వస్తున్న ఫిర్యాదుల మేరకు బుధవారం ఆర్ఏఒ మునిస్వామి పిల్లంకలో ఉన్న ఫ్రెంచ్ లింకింగ్ ఛానల్‌ను పరిశీలించారు. అనంతరం యానాం సరిహద్దు అరటికాయలంకలో ఉన్న పంపింగ్ హౌస్‌ను అధికారులు ఏఇ కాళ్ల నాగరాజు, జెఇ యాళ్ళ వీరాస్వామి, జ్యోతిరాజుతో కలిసి ఆర్ఏఒ పరిశీలించారు.


వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

వైయస్సార్ కంటి వెలుగు వైద్యశిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెంలో బుధవారం వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తమాలజిస్ట్ సత్తిబాబు సుమారు 100 మందికి పరీక్షలు చేసి పదిమందిని కాకినాడ జిజిహెచ్‌కు శస్త్ర చికిత్స కై తరలించారు. 90 మందికి ఉచితంగా వైయస్సార్ కంటి వెలుగు కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, వైసిపి నాయకులు కొపనాతి నాగరాజు, ఎంఎల్‌హెచ్ పి.లక్ష్మీ సింధూజ, ఏఎన్ఎం. మాధవి, పంచాయతీ కార్యదర్శి రామరాజు, వార్డు సభ్యులు బర్రె కాట వేణి, సంగాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గొర్రగేదె మృతదేహం

రైతుల్లో వన్య ప్రాణుల భయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల మెట్ట ప్రాంతంలో రైతులకు ప్రజలకు నిద్ర లేకుండా చేసిన పెద్దపులి సంచారం సంఘటన మరువక ముందే పత్తిపాడు మండలం ఒమ్మంగి శరభవరం మధ్య సరుగుడు తోటల్లో అడవి గొర్రె మృతదేహం లభించటం ఆ ప్రాంతవాసులను భయాందోళనలు గురిచేస్తోంది. ప్రత్తిపాడు మండలం వొమ్మంగి గ్రామం నుండి శరభవరం వెళ్లే రహదారికి ఇరువైపులా గల సరుగుడు తోటల్లో గొర్రగేదె రైతులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. గతంలో పులి సంచరించిన ప్రాంతంలోనే గొర్రగేదె మృతదేహం లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎక్కడైనా వేటగాళ్ల దాడికి గురై తప్పించుకొచ్చిందా? లేక ఆహారం లభించక మృతి చెందిందా అనేది చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా మైదాన ప్రాంతంలో వన్య ప్రాణుల సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.

హక్కులపై అవగాహన ముఖ్యం

-వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ప్రెసిడెంట్ రఘుపతి వసంత్ కుమార్



మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వసంత్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ

ఇంధన వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వినియోగదారుల హక్కులపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రఘుపతి వసంత్ కుమార్ అన్నారు. జిల్లా వినియోగదారుల సమాచారకేంద్రం, జిల్లా వినియోగారుదారుల సమాఖ్య, జిల్లా పౌరసరఫరాలు, యువజన సర్వీసులు, పీ.ఆర్.గవర్నమెంట్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని స్థానిక పీ.ఆర్.కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రఘుపతి వసంత్‌కుమార్, సభ్యులు చక్కా సుసి, చాగంటి నాగేశ్వరరావు, మైనారిటీ సంక్షేమ అధికారి, ఇన్‌ఛార్జ్ సెట్రాజ్ సీఈవో షేక్ ఇమ్రాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఆర్.రమేష్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సరోజిని తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరం వినియోగదారులమేనని, నిత్య జీవితంలో రోజూ ఏదో ఒక వస్తువును కొనుగోలు చేయడం జరుగు తుందన్నారు. మార్కెట్లో లభించే వివిధ రకాల వస్తువుల నాణ్యత, సరైన ప్రమాణాలతో రూపొందాయా అనే అంశంపై వినియోగదారులు దృష్టిసారిం చాలన్నారు. సెట్రాజ్ సీఈవో షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఇంధన పరివర్తనల ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. డి.చిన్నారావు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం (డీసీఐసీ) కన్వీనర్ భమిడి శివమూర్తి శుద్ధ ఇంధనం, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ప్రాముఖ్యం, వినియోగదారుల హక్కులపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూపొందించిన మేలుకొలుపు పుస్తకాన్ని, కరపత్రాన్ని గౌరవ అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో డీసీపీసీ సభ్యులు అడ్వొకేట్ కొమ్మూరి శ్రీనివాసరావు, సీసీసీ రాజు, భమిడి పవన్ చైతన్య, కళాశాల అధ్యాపకులు తెలిపారు. **పెద్దాపురం :** వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవడం ద్వారానే వినియోగ దారుల హక్కులు పరిరక్షించబడతాయని వినియోగదారుల కమిషన్ చైర్మన్ చెరుకూరి వసంత కుమార్ అన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌డిఒ జె సీతారామారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో వసంతకుమార్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించే మార్చి నెల మ్యాగజైన్‌ను సదస్సులో ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ కమిటీ సభ్యులు చాగంటి నాగేశ్వరరావు, చెక్కా సుశి, శ్రీనివాస రావు, భళ్ళమూడి సూర్యనారా యణ మూర్తి, తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ ఎల్.మోహన్, పెద్దాపురం వినియోగదారుల ఫోరం కార్యదర్శి మండవిల్లి భాస్కర్రావు, సభ్యులు కె. సుధాకర్, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

10 ఎలక్ట్రికల్ వాహనాల దగ్ధం

బ్యాటరీకి ఛార్జింగ్ పెడుతుండగా అంటుకున్న మంటలు : రూ.12 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎలక్ట్రికల్ వాహనం బ్యాటరీ చార్జింగ్ పెడుతుండగా చెలరేగిన మంటలతో భారీ స్థాయిలో పొగతో కూడా మంటలు ఎగసిపడ్డాయి. చుట్టూ జననివాసం మధ్య జరిగే ఈ ప్రమాదంలో సకాలంలో స్పందించిన అగ్నిమాపక అధికా రులు మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. కాకినాడ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సరళ ఆటోమొబైల్స్‌లో బుధవారం మధ్యాహ్నం షో రూమ్‌కు వచ్చిన వాహనానికి సిబ్బంది వాహనానికి సంబంధించిన బ్యాటరీకి చార్జింగ్ పెడుతుండగా ఆకస్మాత్తుగా పొగ వచ్చి బ్యాటరీ పేలడంతో భయంతో షాపులో ఉన్న సిబ్బంది బయటకు పరుగులు తీశారు. ఈ బ్యాటరీలను సాధారణంగా లిథియం అయాన్ అని పిలుస్తుంటారు. ఇవి పెట్రోల్ కన్నా ప్రమాదకరం కావడంతో, పేలిన బ్యాటరీ నుంచి వచ్చిన మంటలు ఇతర వాహనాలకు అంటుకున్నాయి. దీంతో షాపులో ఉన్న పది వాహనాలకుపైగా మంటల్లో చిక్కుకొని పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాలలిపేట ఎఫ్‌డిఒ ఏసుబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. సుమారు 12 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.


బ్యాటరీ కి ఛార్జింగ్ పెడుతుండగా అంటుకున్న మంటలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలో ఒకటవ వార్డులో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి బుధవారం రూ.20 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి దాడిశెట్టి రాజా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించగా ప్రజల నుండి వచ్చిన సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల నిధులు ఆ పరిధిలో ఉన్న సచివాలయానికి కేటాయించినట్టు తెలిపారు. రూ.16 లక్షలతో సీసీ రోడ్లో నిర్మాణానికి, రూ.నాలుగు లక్షలతో తాగునీటి ఎద్దడి తీర్చడానికి పబ్లిక్ కుళాయిల పైపులైను నిర్మాణ పనులకు తుని పట్టణ చైర్‌పర్సన్ సుధారాణి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తుని కో ఆప్షన్ సభ్యులు ఏలూరు బాలు, వైస్ చైర్‌పర్సన్ పామర్తి మహేష్, రేలంగి రమణ గౌడ్, బోడపాటి శ్రీను, షేక్ క్వాజా, తుని మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ రాజు, కౌన్సిలర్ వారధి జ్యోతి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

మట్టి లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం తాళ్లరేవు పంచాయతీ చెరువుగట్టు సెంటర్ సమీపంలో మెయిన్ రోడ్డుపై వెళుతున్న మట్టి లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. కాజులూరు మండలం శీలలంక ప్రాంతం నుంచి తాళ్ళరేవు మండలం మీదుగా వెళుతున్న మట్టి లారీలు ప్రమాదకరంగా మారాయనీ, గ్రామస్తులు బుధవారం రాత్రి లారీలను అడ్డుకున్నారు. లారీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తిస్తూ గ్రామస్తుల పట్ల దుర్భాషలాటంతో తాళ్ళరేవు చెరువుగట్టు సెంటర్లో బుధవారం రాత్రి కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా కాజులూరు మండలం శీలలంక గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు లారీని అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని, ఎస్ఐ తెలపడంతో గొడవ కొంతమేరకు సద్దుమణిగింది.


మట్టి లారీని అడ్డుకున్న తాళ్లరేవు గ్రామస్తులు

టిడిపి నేతలపై దాడులకు ఖండన

ప్రజాశక్తి-కొత్తపేట

నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి, ఇసుక, మద్యం అక్రమ తవ్వకాలు, అమ్మకాలతో రూ.కోట్ల దోచుకున్న కొందరు వైసిపి నాయకులు టిడిపి నేతలపై దాడులకు పాల్పడుతున్నారని మండల అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. బుధవారం వాడపాలెం బండారు స్వగృహం నందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం రాత్రి రావులపాలెం మండలం కొమరాజులంకలో టిడిపి నేత గుర్రాల నాగభూషణం ఇంటిపై కొమరాజులంక సర్పంచ్ అనుచరులు దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వాడపాలెం గ్రామ సర్పంచ్, త్సామా బాబు, కొత్తపేట నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షుడు..పల్లి ఏసు వానపల్లి మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం** అధికారం అడ్డుపెట్టుకుని వైసిపి నాయకుల ఆగడాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయని ఇళ్లపై దాడులకు దిగుతున్నారని కొత్తపేట నియోజక వర్గ టిడిపి నాయకులు విమర్శించారు. రావులపాలెం మండలం కొమరాజులంకలో టిడిపి నాయకులు మాట్లాడుతూ అధికారం అడ్డుపెట్టుకుని మట్టి మాఫియా చెలరేగిపోతోందని ఆరోపించారు. మంగళవారం రాత్రి మాజీ సర్పంచ్ గుర్రాల నాగభూషణం ఇంటిపై జరిగిన దాడిని టిడిపి నాయకులు ఖండించారు. దీనిపై జిల్లా ఎస్పికి టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. గ్రామాలలో ఉన్న పట్టా భూముల్లో మట్టిని అక్రమంగా తరలిస్తుంటే కొమరాజులంక మాజీ సర్పంచ్, గ్రామస్తులు కలిసి న్యాయస్థానన్ని ఆశ్రయించారని తెలిపారు. న్యాయస్థానం ద్వారా మట్టి మాఫియా కు అడ్డు తగులుకోవడంతో ఇళ్లపై దాడులకు దిగి భయభ్రాంతులకు గురిచేసి వారు పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీను, ధర్నాల రామకష్ణ, బండారు సత్తిబాబు, ముత్యాల బాబ్జి సయ్యపరాజు రామకష్ణంరాజు, చిలువూరి సతీష్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన యువకుడు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణంలో ఈ నెల 9న అదృశ్యమైన యువకుడు బుధవారం ఇంటికి చేరాడు. తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండలంలోని దుగ్గుదూరు గ్రామానికి చెందిన కొల్లి ప్రేమ కుమార్ తండ్రి కొల్లి ఇజ్రాయేలుతో కలిసి మండపేటలో దళితపేటలో ఉన్న బంధువులను చూసేందుకు ఈనెల 9న ఉదయం వచ్చాడు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు మండపేట నుండి తిరిగి తన ఇంటికి వెళ్ళే క్రమంలో అదృశ్యమయ్యాడు. దీంతో అతని బంధువులు దినపత్రికలు, సోషల్ మీడియాలోనూ అతని ఫోటో షేర్ చేసి ఆచూకీ తెలపాలని కోరడంతో స్పందించిన కొందరు యానాంలో ఉన్నట్లు చెప్పడంతో బంధువులు అక్కడికి వెళ్లి అతను తీసుకువచ్చారు. ఆచూకీ తెలిపిన వారికి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.